కుమారస్వామి, భూమిశెట్టి, చైతన్యరావు, దిల్‌రాజు, మామిడి హరికృష్ణ

కొత్త కాన్సెప్ట్‌తో 'షరతులు వర్తిస్తాయి'

చైతన్యరావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి (అక్షర) దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టార్‌లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. 'షరతులు వర్తిస్తాయి' చిత్రం టీజర్ విడుదల కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అగ్ర నిర్మాత దిల్ రాజు హాజరు కాగా, దర్శకుడు వేణు ఊడుగుల, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ.. 'మామిడి హరికృష్ణ గారితో నాకు బలగం సినిమా టైంలో పరిచయమైంది. ఆయన ఆహ్వానం మేరకు రవీంద్రభారతికి వెళ్లి సినిమా ఇండస్ట్రీకి రావాలనుకునే వారికి కల్చరల్ డిపార్ట్‌మెంట్ ఇస్తున్న శిక్షణ చూసి ఆనందపడ్డా. 'షరతులు వర్తిస్తాయి' సినిమాను మంచి కాన్సెప్ట్‌తో తీశారు. బలగం కంటే ఎక్కువగా తెలంగాణ నేపథ్యంతో తెరకెక్కించారు' అన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. 'సహజమైన కథా కథనాలతో కొత్త సినిమాటిక్ లిబర్టీ తీసుకొని రూపొందిన చిత్రమిది. సినిమా చేయాలనే కలతో గోదావరిఖని ప్రాంతం నుంచి వచ్చిన కుమారస్వామి కల నెరవేరబోతున్నది' అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రవీణ వనమాలి, శేఖర్ పోచంపల్లి, సంగీతం: అరుణ్ చిలువేరు, నరేశ్ బొబ్బిలి, నిర్మాతలు: శ్రీలత, నాగార్జున సామల, శారద, శ్రీష్‌కుమార్ గుండా, విజయ, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు, రచన-దర్శకత్వం: కుమారస్వామి.

సుత్తితో గోడలు పగలగొట్టడం నేర్చుకున్నా

'నిర్మాణ రంగ కార్మికురాలిగా సుత్తితో గోడలను పగలగొట్టడంలో శారీరక శిక్షణ తీసుకున్నాను' అని చెప్తున్నది అందాల తార అదా శర్మ. నటుడు సునీల్ గ్రోవర్‌తో కలిసి 'సన్‌ఫ్లవర్-2' వెబ్‌సిరీస్‌లో కనిపించనున్నది. ఈ సిరీస్ నుంచి ఆమె ఫస్ట్‌లుక్ శనివారం విడుదలైంది. 2021లో సునీల్ గ్రోవర్ నటించిన 'సన్‌ఫ్లవర్' ఓటీటీ వేదికగా ప్రేక్షకాదరణ పొందడంతో ఈ సిరీస్ సీక్వెల్‌గా వస్తున్న 'సన్‌ఫ్లవర్-2' జీ5 ద్వారా త్వరలో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది. ఇందులో అదాశర్మ బార్ డ్యాన్సర్‌గా నటించనున్నది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో అదా శర్మ చీరలో రాజ్ అని రాసి ఉన్న టెడ్డీ బేర్ పట్టుకొని చురుకైన చూపులతో అందంగా కనిపిస్తున్నది. 'డోంట్ క్రాస్ క్లైమ్ సీన్' అని రాసి ఉన్న బారికేడ్ టేపుల ముందు నిలబడి ఉంది. అదాశర్మ సామాజిక మాధ్యమాల్లోనూ ఆసక్తిని రేకెత్తించే పదాలు జోడించి ఫస్ట్‌లుక్‌ను పోస్ట్ చేసింది. ఈ సిరీస్‌లో తన పాత్ర గురించి, ఈ పాత్ర కోసం తాను ప్రిపేర్ అయిన తీరు గురించి చెప్పింది అదాశర్మ. 'ఒక విచిత్రమైన అమ్మాయి రోజీగా నటించాను. ఈ పాత్ర కోసం సుత్తితో గోడలను పగలగొట్టడం నేర్చుకునేందుకు భవన నిర్మాణ రంగ కార్మికురాలిగా శారీరక శిక్షణ తీసుకున్నాను' అని పేర్కొంది. ఈ సిరీస్‌లో సునీల్ గ్రోవర్.. సోను సింగ్ పాత్రలో నటిస్తుండగా, మిస్టర్ అహుజాగా ముకుల్ చద్దా, దిలీప్ అయ్యర్‌గా ఆశిష్ విద్యార్థి, ఇన్‌స్పెక్టర్ దిగేంద్రగా రణవీర్ షోరే, ఇన్‌స్పెక్టర్ తాంబేగా గిరీష్ కులకర్ణి నటించారు.

మార్చిలో వస్తున్నాడు



వరుణ్‌తేజ్

దేశ రక్షణలో ప్రధాన భూమిక పోషించే త్రివిధ దళాల్లో ఒకటైన వైమానిక దళం శక్తి సామర్థ్యాలను, విధి నిర్వహణంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను, దేశ రక్షణ విషయంలో రాజీలేని పోరాటాన్ని ఆవిష్కరిస్తూ తెరకెక్కించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన ఈ చిత్రానికి శక్తిప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్, రినైసన్స్ సంస్థలు నిర్మించాయి. మార్చి 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించారు. టీజర్‌తో పాటు ఫస్ట్ సింగిల్ 'వందేమాతరం'కు మంచి స్పందన లభించిందని, ప్రజల్లో దేశభక్తిని ప్రోదికొల్పే చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాలో వరుణ్‌తేజ్ వైమానిక దళాధికారి పాత్రలో నటిస్తుండగా, కథానాయిక మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా కనిపించనుంది.

నాగలాపురం నాగమ్మ పౌరుషం

మంచు లక్ష్మి

మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'ఆదిపర్వం'. అన్వికా ఆర్ట్స్, ఎ.వన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్త నిర్మాణంలో తెరకెక్కుతున్నది. ఐదు భాషల్లో వెలువడనున్న ఈ సినిమాకు సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. 1974 నుంచి 1992 మధ్య జరిగే నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ డ్రామాలో మంచు లక్ష్మి 'నాగలాపురం నాగమ్మ'గా కనిపించనున్నది. కథలో భాగంగా మంచు లక్ష్మి ఎంతో రిస్క్‌తో రెండు పోరాట ఘట్టాల్లో పాల్గొన్నారని, ఈ ఫైటింగ్స్ సినిమాకు హైలైట్ అని, గ్రాఫిక్స్ వర్క్ చివరి దశకు చేరుకుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలో ప్రధాన తారాగణం: మంచు లక్ష్మి, శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, వెంకట్ కిరణ్, సత్యప్రకాశ్, సుహాసిని తదితరులు, కెమెరా: ఎస్ఎన్.హరీశ్, సంగీతం: మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి.సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్, నిర్మాత: ఎంఎస్‌కే, రచన-దర్శకత్వం: సంజీవ్ మేగోటి.

బ్యాంక్ ఉద్యోగి పాత్రలో

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి వారసుడిగా కెరీర్ ప్రారంభించిన దుల్కర్ సల్మాన్. పుష్కర కాలంగా తనదైన నటనతో పాన్ ఇండియా స్థాయికి ఎదిగారు. తన తదుపరి చిత్రం 'లక్కీ భాస్కర్' ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్నది. వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. నటుడిగా దుల్కర్ సల్మాన్ 12 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 'లక్కీ భాస్కర్' నుంచి తాజాగా మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మగధ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న లుక్‌లో దుల్కర్ కనిపిస్తున్నారు. 80ల కాలం నాటి బొంబాయి (ముంబయి) నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమాను తెలుగు, మలయాళం, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వెంకీ అట్లూరి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో తెరకెక్కుతున్నందున భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందని మేకర్స్ నమ్ముతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, బ్యానర్స్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, రచన-దర్శకత్వం: వెంకీ అట్లూరి.

నెలకో సినిమా విడుదల చేస్తాం!

ఈ ఏడాది తమ సంస్థ 50 చిత్రాల మైలురాయిని అందుకుంటుందనే నమ్మకం ఉందని, ఇక నుంచి ప్రతీ నెలా ఓ చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని చెప్పారు అగ్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై రవితేజ కథానాయకుడిగా ఆయన నిర్మించిన 'ఈగల్' చిత్రం ఈ నెల 9న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పాత్రికేయులతో ముచ్చటించారు. తాజా చిత్రాలతో పాటు తమ సంస్థ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు.



టీజీ విశ్వప్రసాద్

- ఈ సినిమాకు ముందు రవితేజతో 'ధమాకా' చేశాం. అది పూర్తి మాస్ ఎంటర్‌టైనర్ అయితే.. 'ఈగల్' క్లాస్ అండ్ స్టైలిష్ యాక్షన్ సినిమాగా ఆకట్టుకుంటుంది. ఇందులో వినోదానికి కొదువుండదు. రవితేజ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ కథలో అన్ని వాణిజ్య హంగులతో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం ఉంటుంది.
- రవితేజతో మా సంస్థకు చక్కటి అనుబంధం ఉంది. అందుకే ఆయనతో వరుసగా సినిమాలు చేస్తున్నాం. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని 'ఈగల్' చిత్రాన్ని స్టైలిష్‌గా ప్రజెంట్ చేశారు. ఆయన మేకింగ్ ఎక్స్‌ట్రార్డినరీగా అనిపించింది.
- తొలుత ఈ చిత్రాన్ని జనవరి 13న విడుదల చేయాలనుకున్నాం. ఆ తర్వాత ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం మేరకు, పరిశ్రమ మేలుని దృష్టిలో పెట్టుకొని వాయిదా వేసుకున్నాం. ఈ సినిమాకు అద్భుతమైన బిజినెస్ జరిగింది. మంచి కంటెంట్ ఉన్న సినిమా కాబట్టి తప్పకుండా ప్రేక్షకులకు రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది
- మా సంస్థ నుంచి ఏడాదికి 15 సినిమాలు విడుదల వుతాయి. ప్రస్తుతం ఆరు చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు ఈటీవీ విన్ కోసం కొన్ని సినిమాలను నిర్మిస్తున్నాం. అమెరికాలో నాలుగు చిత్రాలను తెరకెక్కిస్తున్నాం. ఇక నుంచి ప్రతి నెలా మా సంస్థ నుంచి ఒక చిత్రం విడుదల చేయబోతున్నాం. ప్రభాస్ 'రాజా సాబ్' రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటిస్తాం.

నేను బతికే ఉన్నా!

క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకే అబద్ధపు పోస్టు

పూనమ్ పాండే

వివాదాలకు కేరాఫ్‌గా ఉండే బాలీవుడ్ నటి పూనమ్ పాండే మరోమారు అభిమానులను షాక్‌కు గురిచేసింది. తన నకిలీ డెత్ స్టంట్ ప్రదర్శించి అందరూ నాలుక కరుచుకునేలా చేసింది. తాను చనిపోయినట్లు వ్యక్తిగత సిబ్బందితో శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టించారు పూనమ్. తీరా శనివారం ఉదయం పూనమ్ పాండే మళ్లీ ఇన్‌స్టా వేదికగా ప్రత్యక్షమైంది. తాను ఎక్కడికీ పోలేదని, బతికే ఉన్నానంటూ వీడియోలో మాట్లాడుతున్న పూనమ్‌ను చూస్తూ అందరూ నోరెళ్లబెట్టారు. ఇప్పుడు వారంతా ఆమె తీరుపై మండిపడుతున్నారు. పబ్లిసిటీ కోసం ఆమె చేసిన మరో స్టంట్ అంటూ తిట్టిపోస్తున్నారు. అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సర్వైకల్ క్యాన్సర్ నానాటికీ ప్రమాదకరంగా మారుతున్నదని, దానిపై అవగాహన కల్పించేందుకే చనిపోయినట్లు పోస్ట్ పెట్టించానని వెల్లడించింది పూనమ్. అయితే, స్వలాభం కోసం తాను చనిపోయినట్లు పోస్టు పెట్టిస్తే అది క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించినట్లు ఎలా అవుతుందంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం ఉదయం పూనమ్ తాజా ఇన్‌స్టా పోస్టు ఇలా ఉంది.. 'మీ అందరితో ఒక ముఖ్యమైన విషయం పంచుకోవాలనుకుంటున్నా. నేను ఎక్కడికీ వెళ్లలేదు. బతికే ఉన్నా. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో బాధపడుతున్న నేను ప్రాణాలు కోల్పోలేదు. కానీ, ఈ వ్యాధి ఇప్పటికే వేలాది మంది మహిళల ప్రాణాలు హరించింది. ఇది ఇతర క్యాన్సర్ల మాదిరిగా ప్రమాదకరం కాదు. దీన్ని నివారించడం సాధ్యమే. హెచ్‌పీవీ వ్యాక్సీన్ తీసుకోవడమో లేదా వ్యాధిని ముందస్తుగా గుర్తించడమో అవసరం. ఈ వ్యాధితో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు చాలా దారులున్నాయి. అందరికీ అవగాహన కల్పిద్దాం. నిశ్శబ్దంగా ప్రాణాలను హరిస్తున్న ఈ డిసీజ్ గురించి తీవ్రస్థాయిలో చర్చ జరగాలన్న ఉద్దేశంతోనే నా మరణ వార్తను వ్యాపింపజేశాను. ఈ వార్త అందరినీ ఇబ్బంది పెడుతుందని తెలుసు. అందుకు నన్ను క్షమించండి' అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీన్ని చూసిన పలువురు నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వస్తున్నది. ఏదైనా మంచిని చెప్పాలంటే మంచిగా చెప్పాలి కానీ, ఇలా ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని మనిషి బతికి చెబితే ఇంతలా ప్రజల్లోకి చేరేది కాదని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఫ్లిన్ రెమెడియోస్ అనే జర్నలిస్ట్ ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి పూర్తి విచారణ చేపట్టాలని ముంబయి పోలీసులను ఎక్స్ వేదికగా కోరారు.

వినూత్న కథతో 'ముఖ్య గమనిక'

లావణ్య, విరాన్

అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి హీరోగా నటిస్తున్న చిత్రం 'ముఖ్య గమనిక'. వేణు మురళీధర్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. లావణ్య కథానాయిక. రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించారు. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ను నిర్మాత బన్నీ వాసు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ 'విరాన్ నాతో పాటు అల్లు అర్జున్ సినిమా కథలు వినేవాడు. బన్నీకి విరాన్ అంటే చాలా ఇష్టం. ఏదైనా కొత్త కథ వినాల్సివస్తే విరాన్‌ను పిలవండని చెప్పేవాడు. విరాన్ హీరోగా నక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అన్నారు. బన్నీ వాసు సినీ ప్రయాణాన్ని తాను స్ఫూర్తిగా తీసుకుంటానని హీరో విరాన్ ముత్తంశెట్టి అన్నారు. ఓ వినూత్నమైన కథతో సినిమాను తెరకెక్కించామని, కొత్తవారైనా ఆర్టిస్టులందరూ చక్కటి నటన కనబరిచారని దర్శకుడు వేణు మురళీధర్ చెప్పారు. ఈ నెల 23న సినిమాను విడుదల చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కిరణ్ వెన్న, నిర్మాణ సంస్థ: శివిన్ ప్రొడక్షన్స్.

హనీమూన్ ముచ్చట్లు

చైతన్య రావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రల్ని పోషించారు. బాల రాజశేఖరుని దర్శకుడు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కించారు. ఈ సినిమాలోని రెండో గీతం 'ప్రేమ..'ను ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. కల్యాణి మాలిక్ స్వరపరచిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఇదే వేడుకలో సంగీత దర్శకుడు కల్యాణి మాలిక్ జన్మదిన వేడుకల్ని నిర్వహించారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఆద్యంతం వినోదాన్ని పంచే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శిష్టా వి ఎమ్‌కె, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఆర్.పి.పట్నాయక్, నిర్మాతలు: కెకెఆర్, బాలరాజ్, రచన-దర్శకత్వం: బాల రాజశేఖరుని.

సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పదో సీజన్

సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్) పదో సీజన్ ప్రోమోను శనివారం దుబాయ్‌లో ఆవిష్కరించారు. బుర్జ్ ఖలీఫా వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. సీసీఎల్‌లో మొత్తం ఎనిమిది జట్లు పోటీ పడబోతున్నాయి. వీటికి కెప్టెన్లుగా తమన్-సుధీర్‌బాబు (తెలుగు), సుదీప్ (కన్నడ), సోహైల్ ఖాన్ (హిందీ), ఆర్య-జీవా (తమిళం), జిషు సేన్‌గుప్తా (బెంగాల్), ఉన్ని ముకుందన్ (మలయాళం), బన్ను థిల్లాన్, సోనూసూద్ (పంజాబీ) వ్యవహరించనున్నారు. ఫిబ్రవరి 23 నుంచి షార్జాలో ఈ టోర్నీ ప్రారంభం కానుంది. సీసీఎల్ ప్రతీ ఏడాది వృద్ధి చెందుతున్నదని, భారతదేశంలో వివిధ నగరాల్లో 20కిపైగా మ్యాచ్‌లతో సీజన్ 10 వినోదాన్ని పంచుతుందని సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్ ఇందూరి తెలిపారు.